సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం। 2। జూన్। 2023



వీర్ కశ్యప్‌కు నేవీ సత్కారం

పీఎం రాష్ట్రీయ బాల పురస్కార్ గ్రహీత మాస్టర్ వీర్ కశ్యప్‌ను భారత నావికాదళపతి అడ్మిరల్ హరికుమార్ సత్కరించారు. 8లో



'జూనియర్' సందడి..! 8లో

ఉమ్మడి విశాఖ జిల్లాలో జూనియర్ కాలేజీలు తెరుచుకున్నాయి. వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు కాలేజీల బాట పట్టారు.



భక్తిశ్రద్ధలతో హోమం

చింతపల్లి: వంగసార ఆశ్రమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, , హోమం, శ్రీనివాస కల్యాణం నిర్వహించారు.

న్యూస్‌రీల్

విద్యాశాఖలో బదిలీలు

విశాఖ విద్య: ఉమ్మడి విశాఖ జిల్లాలోని విద్యాశాఖలో పలువురు అధికారులు, ఉద్యోగులు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని అధికారులు, ఉద్యోగుల్లో దీర్ఘకాలంగా పనిచేస్తున్న వారికి స్థానచలనం కల్పించారు. విశాఖ డీఈవో కార్యాలయంలోని సూపరింటెండెంట్ జగన్నాథంను అనకాపల్లి జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయానికి బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న సుందర్‌సింగ్ విశాఖకు బదిలీ అయ్యారు. వీరితో పాటు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని విద్యాశాఖలో పలువురు ఉద్యోగులకు బదిలీలు జరిగాయి.

చింతూరు డీఎఫ్‌వోగా పుష్పసౌజన్య

చింతూరు: స్థానిక డీఎఫ్‌వోగా పుష్పసౌజన్య నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ డీఎఫ్‌వోగా బాధ్యతలు నిర్వహించిన సాయిబాబా మంగళగిరికి బదిలీ అయ్యారు. దీంతో ప్రస్తుతం జంగారెడ్డిగూడెం సబ్ డీఎఫ్‌వోగా విధులు నిర్వహిస్తున్న పుష్పసౌజన్యను చింతూరు డీఎఫ్‌వో నియమించారు. గతంలో ఆమె చింతూరు లాగింగ్ డీఎఫ్‌వో, ఇన్‌చార్జి డీఎఫ్‌వోగా విధులు నిర్వహించారు.

రాయితీ విత్తనాలు సద్వినియోగం



విత్తనాలను పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్మియా

గూడెంకొత్తవీధి: ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా 90 శాతం రాయితీపై పంపిణీ చేస్తున్న వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చింతపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్మియా కోరారు. గురువారం స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు రాయితీపై మంజూరైన విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయినకుమారి, మండల వ్యవసాయాధికారి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: మండలంలో సుర్మతి పంచాయతీ మద్దివీధి గ్రామంలో 20 కుటుంబాల వారు గురువారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన విధానాలు, సంక్షేమం, అభివృద్ధికి ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్టు వారు పేర్కొన్నారు. మద్దివీధి గ్రామానికి చెందిన జి రఘునాథరావు, జి. కృష్ణారావు, అర్జున్, చిన్నధనుంజయ, లలిత, లక్ష్మణ్, బలరాం, సురేష్, జి.మోహన్‌రావు, అర్జున్‌రెడ్డి, ధనుష్, జి.బాబు, ధనలక్ష్మి, ప్రసాద్, జి.చిన్న, లక్ష్మి, జి బాబూరావు, విజయకుమార్, జి.హరి, జి సింహాచలం, వి.బాలన్న, జి పుష్ప, జి. సరస్వతి తదితరులు పార్టీలో చేరారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన పెను ప్రమాదం

- ఊడిపోయిన ముందు చక్రం
- ఆందోళనకు గురైన ప్రయాణికులు
- చాకచక్యంగా బస్సును నిలిపిన డ్రైవర్



ముందు చక్రం ఊడిపోయిన ఆర్టీసీ బస్సు

రాజవొమ్మంగి: నర్సీపట్నం నుంచి ఏలేశ్వరం బయలుదేరిన ఏలేశ్వరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. మండలంలోని దాకరాయి గ్రామ సమీపానికి వచ్చేసరికి ముందు చక్రం ఊడిపోవడంతో బస్సులో ఉన్న 50 మంది ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. డ్రైవర్ చాకచక్యంగా బస్సును వెంటనే నిలిపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని వారంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల కాలంలో ఏలేశ్వరం డిపోకు చెందిన ఆర్టీసీబస్సులు తరచూ మొరాయించి మార్గం మధ్యలోనే నిలిచిపోతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

ఐఎన్‌ఎస్ వర్ష..

సీక్రెట్ సబ్‌మెరైన్ బేస్

- రాంబిల్లి వద్ద సాగరతీర అంతర్భాగంలో నిర్మాణం
- ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం
- ఒకే సారి 12 సబ్‌మెరైన్లు ఉంచేలా ఏర్పాటు

సాక్షి, విశాఖపట్నం: దేశానికి వ్యూహాత్మక రక్షణ ప్రాంతంగా.. సహజ సిద్ధమైన భౌగోళిక రక్షణతో పాటు శత్రుదేశాలకు సుదూరంగా ఉండటం తూర్పు నౌకాదళం ప్రత్యేకత. పెరుగుతున్న నౌకాదళ సంపత్తికి అనుగుణంగా.. విభిన్న స్థావరాలను ఏర్పాటు చేసుకుంటున్న ఈఎన్‌సీ.. ప్రత్యామ్నాయ బేస్‌గా అతి రహస్య స్థావరాన్ని సిద్ధం చేసుకుంటోంది. అత్యంత శక్తిమంతమైన అణు జలాంతర్గాములను సాగర గర్భంలోనే ఉంచేలా..విశాఖ శివారు రాంబిల్లిలో నిర్మిస్తున్న ఐఎన్‌ఎస్ వర్ష ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి రానుంది. ఈఎన్‌సీకి చెందిన స్థావరాలు మొత్తం 15 ఉండగా ఇందులో ఏడు నేవల్ బేస్‌లు విశాఖలోనే ఉన్నాయి. దీనికి తోడుగా రాంబిల్లిలో కొత్త నేవల్ బేస్ ఐఎన్‌ఎస్ వర్ష నిర్మితమవుతోంది. ఇది మిగిలిన స్థావరాలతో పోలిస్తే పూర్తిగా భిన్నమైనది. వర్ష వంటి భూగర్భ నౌకా స్థావరాలు కొత్తవి కాదు. రష్యా, చైనా.. తన జలాంతర్గాములను ఆపరేట్ చేయడానికి ఈ తరహా అండర్ గ్రౌండ్ స్థావరాలను నిర్మించుకున్నారు. అదేవిధంగా.. భారత నౌకాదళానికి కూడా రహస్య స్థావరం ఉండాలనే ఉద్దేశంతో ఐఎన్‌ఎస్ వర్షను నిర్మిస్తున్నారు. తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రానికి 50 కి.మీ దూరంలో ఉన్న రాంబిల్లిలో దీన్ని నిర్మిస్తున్నారు. మొత్తం 670 హెక్టార్ల విస్తీర్ణంలో టన్నెల్స్ రూపంలో ఇది సిద్ధమవుతోంది.

ప్రస్తుతం ఈఎన్‌సీ ప్రధాన కేంద్రంలోనే యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్లను ఉంచుతున్నారు. విశాఖపట్నం పోర్టు కూడా సమీపంలో ఉండటంతో కార్గో నౌకలు, కంటైనర్ నౌకలతో నిరంతరం రద్దీగా ఉంటోంది. భద్రత దృష్ట్యా మరో రహస్య స్థావరం కోసం వర్షను నిర్మిస్తున్నారు. అణు జలాంతర్గాములు దేశ నౌకాదళంలో అత్యంత కీలకమైనవి. వీటి రాకపోకలను అత్యంత గోప్యంగా ఉంచడం చాలా ముఖ్యం. ఐఎన్‌ఎస్ అరిహంత్ వంటి న్యూక్లియర్ సబ్‌మెరైన్లు నెలల తరబడి సముద్ర గర్భంలో విధి నిర్వహణలో ఉంటాయి. 200 మీటర్ల లోతులో నిశ్శబ్దంగా కదులుతున్నట్లు గుర్తించడం, ట్రాక్ చేయడం దాదాపు అసాధ్యం. అయితే ఇవి పోర్టు సమీపంలో లంగరు వేసినప్పుడు శత్రు గూఢచారి శాటిలైట్స్ సులభంగా గుర్తించగలవు. వీటి సమాచార గోప్యత కోసం ఐఎన్‌ఎస్ వర్ష ఉపయోగపడుతుంది.



రాంబిల్లి వద్ద ఐఎన్‌ఎస్ వర్ష నేవల్ బేస్ నిర్మితమవుతున్న ప్రాంతం

దేశ రక్షణకు కీలక స్థావరం

ఐఎన్‌ఎస్ వర్షలో ఐదు టన్నెల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ సొరంగాల ద్వారా సబ్‌మెరైన్లు స్థావరంలోకి రాకపోకలు సాగిస్తుంటాయి. కాబట్టి జలాంతర్గాములు ఉపరితలంపైకి రావాల్సిన అవసరం లేదు. అందువల్ల శత్రువులు వీటి జాడని కనిపెట్టలేరు. వర్ష బేస్‌లో సిబ్బంది విశ్రాంతి సౌకర్యాలు, మరమ్మతులు, నిర్వహణకు అనువుగా భవనాలు నిర్మించారు. మొత్తం 12 న్యూక్లియర్ సబ్‌మెరైన్లు ఒకే కాలంలో అండర్‌గ్రౌండ్‌లో ఉండేలా ఏర్పాట్లు చేశారు. అంతే కాకుండా డీజిల్, ఎలక్ట్రిక్ సబ్‌మెరైన్లను కూడా ఇక్కడి నుంచే ఆపరేట్ చేయగల సామర్థ్యం ఉంది. శత్రుమూకలు అణు దాడి చేసినా.. వాటి నుంచి సురక్షితంగా ఉండేలా ఐఎన్‌ఎస్ వర్ష నిర్మాణం జరుగుతోంది. సబ్‌మెరైన్లలో అణు రియాక్టర్ల నిర్మాణం, అమర్చడం కూడా ఇక్కడ జరగనుంది. నీటి అడుగున స్థావరం వద్ద మిస్సైల్ టెక్నికల్ పొజిషన్స్ అనే ఆయుధ నిల్వ సౌకర్యం కూడా ఉంది. మొత్తంగా దేశ రక్షణకు కీలక స్థావరంగా ఐఎన్‌ఎస్ వర్ష సన్నద్ధమవుతోంది. కోవిడ్ కారణంగా పనులు ఆలస్యమయ్యాయని.. ఈ ఏడాది చివరి నాటికి ఇది అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నట్లు భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ హరికుమార్ స్పష్టం చేశారు.



అండర్ గ్రౌండ్‌లో సబ్‌మెరైన్లు (ఊహాచిత్రం)

అత్యాధునికంగా నేవల్ బేస్



రాంబిల్లిలో నిర్మితమవుతున్న నేవల్ ఆల్టర్నేటివ్ ఆపరేషనల్ బేస్(ఎన్ఏవోబీ) పనులు చురుగ్గా సాగుతున్నాయి. వీలైనంత త్వరగా దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. తూర్పు తీరంలో ఆరు లక్షల చ.కి.మీ పరిధిలో ఎక్స్‌క్లూజివ్ ఎకనమిక్ జోన్‌తో పాటు మేజర్ పోర్టులున్నాయి. సముద్ర వాణిజ్యానికి తూర్పు తీరం ప్రధాన కేంద్రంగా మారడంతో వాణిజ్య నౌకల రక్షణ బాధ్యత కూడా తూర్పు నౌకాదళమే చూస్తోంది. దీంతో పాటు డీఆర్‌డీవో కార్యకలాపాలకు కూడా విశాఖ వేదికగా మారింది. పలు క్షిపణులు తయారు చేసే ఎస్ఎస్‌బీఎల్ కూడా ఇక్కడే ఉంది. ఎప్పటికప్పుడు నౌకా సంపత్తిని పెంచుకుంటూ శత్రుదుర్భేద్యంగా మారుతున్న నేపథ్యంలో ఈ అత్యాధునిక నేవల్ బేస్ సిద్ధం చేస్తున్నాం. అరిహంత్ క్లాస్ సబ్‌మెరైన్లతో పాటు ఎస్ 5, న్యూక్లియర్ ఎటాక్ సబ్‌మెరైన్లను కూడా ఇక్కడ ఉంచేలా నిర్మిస్తున్నాం.

– అడ్మిరల్ హరికుమార్, భారత నౌకాదళాధిపతి

వలంటీర్లకు ఘన సత్కారం

దేవీపట్నం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందించేందుకు కృషి చేస్తున్న గ్రామ వలంటీర్లను రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఘనంగా సత్కరించారు. ముసుళ్లకుంట గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల ఆవరణలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో సేవా వజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలు అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎక్కడా లేనివిధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి అవినీతిరహిత, పారదర్శకమైన పాలన అందిస్తున్నారన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ వలంటీర్లు అందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం పాముగండిలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామంలో 145 గడపలను సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అర్హతలున్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ఎప్పటికప్పుడు అర్హులను గుర్తించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కుంజం మురళీ, జెడ్పీటీసీ శిరశం సత్యవేణి, ఎంపీడీవో రత్నకుమారి, పార్టీ నేతలు బాబ్జీ, పెద్దబ్బాయిదొర, మురళీకృష్ణ, కృష్ణబాబు, గంగాధర్, కృష్ణబాబు, లక్ష్మణ్, లక్ష్మీదేవి, నాగరత్నం పాల్గొన్నారు.



వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి తదితరులు

ఇష్టంతో పనిచేస్తేనే మంచి ఫలితం

శిశు సంక్షేమ శాఖ పీడీ సూర్యలక్ష్మి

అరకులోయ రూరల్: కష్టమైనా ఇష్టంతో విధులు నిర్వహిస్తేనే మంచి ఫలితం వస్తుందని శిశు సంక్షేమ శాఖ జిల్లా పీడీ స్యూర్యలక్ష్మి అన్నారు. మండలంలో పద్మాపురం, గన్నెల పంచాయతీలో గురువారం ఆమె పర్యటించారు. నాడు–నేడు నిధులుతో చేపట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. పనులు మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మెనూ అమలులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. స్థానిక పోలీసు స్టేషన్ వద్ద గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో సమావేశమయ్యారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించాలని సూచించారు. జరుగుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి పనులకు సంబంధించి ఫొటోలను అప్లోడ్ చేయాలని ఆమె సూచించారు. సీడీపీవో శారద, సిబ్బంది పాల్గొన్నారు.



నాడు–నేడు పనులను పరిశీలిస్తున్న సూర్యలక్ష్మి

ఎస్‌ఎన్‌సీ యూనిట్ పనుల పరిశీలన

పాడేరు రూరల్ : పాడేరు జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేస్తున్న నవజాత శిశు సంరక్షణ కేంద్రం (ఎస్ఎన్‌సీయూ) పనులను వేగవంతం చేయాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. గురువారం సాయంత్రం పాడేరు జిల్లా ఆస్పత్రి పాత విభాగాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఎస్ఎన్‌సీయూ వార్డును తనిఖీ చేసి తల్లులతో మాట్లాడి చిన్నారులకు అందుతున్న సేవల వివరాలను తెలుసుకున్నారు. ఎస్ఎన్‌సీయూ వార్డు పనులను పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ కె. కృష్ణారావు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. వార్డులో అవసరమైన చోట ఏసీలు అమర్చాలని కోరారు. పేషెంట్స్ వెయిటింగ్ వార్డులో ప్రత్యేకంగా ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.



పాడేరు జిల్లా ఆస్పత్రిలో ఎస్ఎన్‌సీయూ వార్డును పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

సారా, మద్యం బాటిళ్లు ధ్వంసం



సారాను పారబోస్తున్న ఏఎస్పీ జగదీష్ అడహళి

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి స్టేషన్ వద్ద రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళి ఆధ్వర్యంలో గురువారం భారీగా సారా ప్యాకెట్లు, మద్యం బాటిళ్లను ధ్వంసం చేశారు. రాజవొమ్మంగి, జడ్డంగి స్టేషన్ల పరిధిలో 35 కేసుల్లో పట్టుబడిన 398 లీటర్ల సారాను, గంగవరం పోలీస్‌స్టేషన్‌లో పట్టుబడిన 13 మద్యం బాటిళ్లను పూడ్చిపెట్టారు. సీఐ షేక్ బాజిలాల్, ఎస్ఐలు షరీఫ్, గోపీ నరేంద్రప్రసాద్, వీఆర్వోలు నాగేశ్వరావు, భారతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న సారా

సారా తయారీ, విక్రయాలకు పాల్పడితే చర్యలు

హుకుంపేట: గ్రామాల్లో సారా తయారీ, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏఎస్పీ ధీరజ్ పేర్కొన్నారు. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 337 లీటర్ల సారా ప్యాకెట్లను గురువారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గతేడాది 16 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 337 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్టు తెలిపారు. సీఐ సుధాకర్, ఎస్ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

1.69 లక్షల మందికి రైతు భరోసా

- ఖాతాల్లో రూ.126 కోట్ల 94 లక్షల 30 వేల జమ
- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలో 1.69 లక్షల మంది రైతుల ఖాతాలకు రైతు భరోసా తొలివిడత నగదు రూ.126కోట్ల 94 లక్షల 30 వేలు రాష్ట్ర ప్రభుత్వం జమచేసిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. రైతు భరోసా నగదు తొలిదశ పంపిణీ కార్యక్రమాన్ని గురువారం కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించారు. ప్రత్యక్ష ప్రసారాన్ని స్థానిక కాఫీ హౌస్ నుంచి కలెక్టర్, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి,చెట్టి పాల్గుణ, ఇతర అధికారులు, రైతులు వీక్షించారు. అనంతరం వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ వ్యవసాయానికి సంబంధించి 4,500 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీకి సిద్ధం చేసినట్టు తెలిపారు. పాడేరు డివిజన్‌లో 15 వేల ఎకరాల్లో అదనంగా కాఫీ తోటలు విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. మరో 11 వేల ఎకరాల్లో గ్యాప్ ఫిల్లింగ్ చేస్తున్నామని ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 10 వేల ఎకరాల్లో ఉద్యానవన తోటల పెంపకానికి చర్యలు చేపట్టామని వివరించారు. జిల్లాలో రైతుల ఆర్థికాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. మూడు లక్షల ఎకరాలకు ఈక్రాప్ నమోదు చేసినట్టు చెప్పారు. జిల్లాలో ఆర్‌వోఎఫ్ రైతులందరికీ రైతు భరోసా అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయ రంగం అభివృద్ధికి గత నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. అటవీ భూములకు కూడా రాష్ట్ర ప్రభుత్వం రూ.13,500 చొప్పున రైతు భరోసా అందిస్తోందన్నారు. కౌలు రైతులకు, జిరాయితీ భూములకు రైతు భరోసా నగదును ప్రభుత్వం జమ చేస్తోందని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామాల్లో పర్యటించినప్పుడు పీఎం కిసాన్ రావడం లేదని ఫిర్యాదు చేస్తున్నారన్నారు. రైతులు ఈకేవైసీ చేసుకోవాలని ఆమె సూచించారు. రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు సకాలంలో తిరిగి చెల్లించాలని కోరారు. పాడేరు డివిజన్ పరిధిలో వెదురు, రబ్బరు సాగును ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ రైతుల అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతులను ప్రభుత్వం రాజులను చేస్తోందన్నారు. స్థానికంగా నర్సరీలు పెంచితే ఏజెన్సీ వాతావరణానికి అనుకూలంగా ఉంటాయని, ఇతర ప్రాంతాల నుండి తెచ్చిన మొక్కలు బతకడం లేదని పేర్కొన్నారు. గిరిజన రైతులకు సకాలంలో విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు. అంతేకాకుండా రాయితీపై దుక్కిటెద్దులను అందించాలని అన్నారు. పట్టుగూళ్ల పెంపకంతో పాటు, అల్లం, పసుపు వంటి వాణిజ్య పంటలను ప్రోత్సహించాలని కోరారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యేలు రైతులకు రైతు భరోసా నగదు నమూనా చెక్కును పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.రత్నకుమారి,జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షురాలు సరస్వతి,జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నందు, పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, డైరక్టర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



చెక్కును పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

19 గిరిజన గ్రామాలకు విద్యుత్!

- రూ.6 కోట్లతో ప్రతిపాదనలు, ఆమోదం వచ్చాక పనులు–డీఈ సురేష్‌బాబు
- డీఈ కార్యాలయం ఎదుట గిరిజన గ్రామస్తుల ఆందోళన





డీఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బూదరాళ్ల గిరిజనులు, వారితో మాట్లాడుతున్న డీఈ

కొయ్యూరు/నర్సీపట్నం : మండలంలో 19 గిరిజన గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు వీలుగా రూ.6 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్టు ఈపీడీసీఎల్ నర్సీపట్నం డీఈ జి.సురేష్‌బాబు గిరిజన యువకులకు తెలిపారు. బూదరాళ్ల పంచాయతీలో కొత్తపల్లి, చల్దిగెడ్డ, తూములోవ, బొడ్డుమామిడి గ్రామస్తులు తమ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం నర్సీపట్నం డీఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. దీనిపై డీఈ వారితో మాట్లాడుతూ బూదరాళ్లతో పాటు ఎం.భీమవరం, యు.చీడిపాలెంలో కలిపి 19 గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ఇప్పటికే ప్రతిపాదించినట్టు తెలిపారు. గతంలో సౌర విద్యుత్ అందించిన 13 గ్రామాలతోపాటు, మిగిలిన గ్రామాలకు కూడా త్వరితగతిన విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. అనుమతులు రాగానే పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా యువకులు వారి బాధల్ని వెల్లబోసుకున్నారు. విద్యుత్ లేకపోవడంతో వివాహమైనప్పటికీ, జీవిత భాగస్వామి తమ గ్రామంలో ఉండేందుకు ఇష్టపడట్లేదని మొరపెట్టుకున్నారు. 2013లో సోలార్ ప్లాంట్ నిర్మాణం చేసి ఐదేళ్ల పాటు కరెంట్ ఇచ్చారన్నారు. సోలార్ ప్లాంట్ పని చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. డీఈ మాట్లాడుతూ ప్రభుత్వం కూడా అన్ని గ్రామాలకు విద్యుత్ సౌకర్యం అదించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ ఆందోళనలో ఆదివాసీల సంఘం కన్వీనర్ కొర్రా రమణబాబు, వి.పండుబాబు, బాలరాజు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై నృసింహ జయంతి రేపు

సింహాచలం: సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం శ్రీనృసింహ జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఏఈవో శ్రీనివాసరావు తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి నృసింహ జయంతి పూజలు జరుగుతాయని, అప్పటి నుంచి భక్తులకు అప్పన్న దర్శనం ఉండదన్నారు. తిరిగి 4వ తేదీ ఉదయం 7 గంటల నుంచి దర్శనాలు లభిస్తాయని తెలిపారు. 3న సాయంత్రం శ్రీకృష్ణాపురంలోని గోశాలలో ఉన్న నృసింహుడి విగ్రహం చెంతన కూడా నృసింహ జయంతి పూజలు నిర్వహిస్తామన్నారు. 4న జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా స్వామికి మూడో విడత చందనం సమర్పణ చేస్తామన్నారు. 4న ఉదయం సుప్రభాతం, ఆరాధన సేవల టికెట్లను రద్దు చేసినట్టు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన సేవలు

శిశు సంక్షేమ శాఖ పీడీ సూర్యలక్ష్మి

డుంబ్రిగుడ: అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన సేవలందిస్తున్నట్లు జిల్లా శిశు సంక్షేమ శాఖ పీడీ సూర్యలక్ష్మి తెలిపారు. రుతు పరిశుభ్రత దినోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అరకు సంతబయలులో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కిశోరబాలికలకు అంగన్‌వాడీ రేషన్ సరుకులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పాఠశాల తరహాల్లో విద్యా బోధన, ఆటపాటలు నేర్పిస్తున్నామన్నారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం పెట్టేందుకు చిన్నారుల తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో నీలమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, సర్పంచ్ శారద, సిబ్బంది పాల్గొన్నారు.

‘జూనియర్’ సందడి..!

- తెరుచుకున్న జూనియర్ కాలేజీలు
- ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభం
- ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్ల జోరు
- ‘నాడు – నేడు’తో మెరుగైన వసతులు

విశాఖ విద్య: ఉమ్మడి విశాఖ జిల్లాలో జూనియర్ కాలేజీలు గురువారం తెరుచుకున్నాయి. వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు కాలేజీల బాట పట్టారు. తొలిరోజు కాలేజీల్లో అడ్మిషన్ల సందడి కనిపించింది. సప్లిమెంటరీ పరీక్షలు గురువారంతో ముగియడంతో శుక్రవారం నుంచి తరగతులను సైతం ప్రారంభించేందుకు కాలేజీల నిర్వాహకులు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో 2023 – 24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ఊపందుకున్నాయి. ఇంటర్మీడియట్ చదువుల ప్రాధాన్యత దృష్ట్యా వార్షిక విద్యా క్యాలెండర్‌ను ప్రభుత్వం ఈ సారి ముందుగానే ప్రకటించింది. జూనియర్ కాలేజీల్లో చదువులు సవ్యంగా సాగేలా ఇంటర్మీడియట్ బోర్డు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వార్షిక విద్యా క్యాలెండర్ పక్కాగా అమలుపై ఫోకస్ పెట్టారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 39 ఉన్నాయి. సోషల్ వెల్ఫేర్ – 11, ట్రైబర్ వెల్ఫేర్ – 10, కేజీబీవీ – 34, బీసీ వెల్ఫేర్ – జీ మోడల్ జూనియర్ కాలేజీలు – 5, హైస్కూల్ ప్లస్ 2 – 10, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 271 కాలేజీలు ఉన్నాయి. వీటి పరిధిలో 2022 – 23 విద్యా సంవత్సరంలో మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు కలిపి 92,895 మంది విద్యనభ్యసించారు. ఈ



అడ్మిషన్ల కోసం కాలేజీకి వచ్చిన విద్యార్థినులు

ఏడాది మొదటి సంవత్సరంలో 50 వేలకు పైగానే ప్రవేశాలు పొందే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా కాలేజీల్లో అడ్మిషన్లపై ఫోకస్ పెట్టారు.

పక్కాగా విద్యా క్యాలెండర్

2023 – 24 విద్యా సంవత్సరంలో 227 రోజులు కాలేజీలు పనిచేసేలా వార్షిక విద్యా క్యాలెండర్‌ను ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ప్రకటించారు. ఈ మేరకు గురువారం నుంచి జూనియర్ కాలేజీలు తెరుచుకున్నాయి. విద్యా క్యాలెండర్ మేరకు తరగతుల నిర్వహణపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా జూలై 26 నుంచి 28 వరకు ఫస్ట్ యూనిట్, ఆగస్టు 24 నుంచి 26 వరకు సెకండ్ యూనిట్ పరీక్షలు నిర్వహించనున్నారు. క్వార్టర్లీ సెప్టెంబర్ 16 నుంచి 23 వరకు, మూడో యూనిట్ పరీక్షలు అక్టోబర్ 16 నుంచి 18 వరకు జరగనున్నాయి. దసరా సెలవులు అక్టోబర్ 19 నుంచి 25 వరకు ఇవ్వనున్నారు. నాలుగో యూనిట్ పరీక్షలు నవంబర్ 23 నుంచి 25 వరకు, హాఫ్ ఇయర్లీ పరీక్షలు డిసెంబర్ 18 నుంచి 23 వరకు ఉంటాయి. సంక్రాంతి సెలవులు 2024 జనవరి 11 నుంచి 17 వరకు ఇస్తారు. ప్రీ ఫైనల్ జనవరి 19 నుంచి 25 వరకు, వార్షిక పరీక్షలు మార్చి మొదటి వారంలో నిర్వహించేలా విద్యా క్యాలెండర్‌ను ప్రకటించారు.

అమ్మ ఒడితో ఉన్నత చదువులవైపు

ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైతం అమ్మ ఒడి పథకం కింద అర్హులైన వారికి ఏడాదికి రూ.15 వేలు ప్రభుత్వం అందిస్తుండడంతో పేద విద్యార్థులు సైతం ఉన్నత చదువుల వైపు వస్తున్నారు. జిల్లాలో 2022 – 23 విద్యా సంవత్సరానికి 25,945 మంది విద్యార్థులకు అమ్మ ఒడి పథకం కింద రూ. 38.92 కోట్లు మంజూరయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కాలేజీలను బలోపేతం చేసే క్రమంలో ‘నాడు – నేడు’ కింద మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించగా, వీటితో చేపట్టిన పనులు తుదిదశకు చేరుకున్నాయి. దీంతో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలూ సమకూరనున్నాయి.

అడ్మిషన్ల పెంపుపై ప్రత్యేక దృష్టి



2023 – 24 విద్యా క్యాలెండర్ ప్రకారం గురువారం నుంచి జూనియర్ కాలేజీల్లో తరగతులు ప్రారంభమయ్యాయి. సప్లిమెంటరీ పరీక్షలు గురువారంతో ముగిశాయి. స్పాట్ వాల్యూవేషన్ కూడా పది రోజుల్లో పూర్తి చేసేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్ల పెంపునకు కృషి చేస్తున్నాం.

– పి.ఉమారాణి, ఆర్ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

పలువురు ఎంపీడీవోలకు పోస్టింగ్‌లు

మహారాణిపేట (విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానాల్లో మండల ప్రజా పరిషత్ అధికారులను నియమించారు. ఈ మేరకు జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామ్మూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల పది మంది జిల్లా పరిషత్ పరిపాలన అధికారులు (ఏవోలు), ఈవోపీఆర్‌డీవోలకు

పేరు	ప్రస్తుత స్థానం	నియమించిన స్థానం
కె.వసంత	ఏవో, ఎస్.రాయవరం	పెందుర్తి
కె.వి.నరసింహారావు	ఏవో, పాడేరు	అనకాపల్లి
ఉషారాణి	ఈవోఆర్‌డీ పద్మనాభం	డుంబ్రిగుడ
ఆశాజ్యోతి	ఏవో	చింతపల్లి
హరిహరరావు	ఈవోఆర్‌డీ, శ్రీకాకుళం	నాతావరం
జి.వి.రవికుమార్	ఈవోఆర్‌డీ, శ్రీకాకుళం	కశింకోట
మన్మధరావు	ఏవో, శ్రీకాకుళం	మునగపాక
అప్పలనాయుడు	ఏవో, శ్రీకాకుళం	యలమంచిలి
కాశీ విశ్వనాథరాజు	ఏవో, శ్రీకాకుళం	కోటవురట్ల
శ్రీనివాస్	ఏవో, తూ.గో.జిల్లా	నక్కపల్లి

ప్రభుత్వం ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించిన సంగతి తెలిసిందే. ఈ పది మందికి కేటాయించిన స్థానాల్లో తక్షణమే విధుల్లో చేరాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర కోరారు.

యువతకు నాటికలపై అవగాహన కల్పించాలి

అనకాపల్లిటౌన్ : నేటి యువత సెల్‌ఫోన్లు, కంప్యూటర్లపై దృష్టి ఎక్కువగా సారించడంతో నాటికలకు ప్రాధాన్యం లేకుండా పోయిందని, భావి తరాలకు సంస్కృతిని అందించడానికి నాటికలు ప్రదర్శిస్తున్నట్టు జార్జి క్లబ్ అధ్యక్షుడు బుద్ద కాశీ విశ్వేశ్వరరావు తెలిపారు. స్థానిక క్లబ్ ఆవరణలో శుక్రవారం నుంచి ఆదివారం వరకూ జరిగే నాటిక పోటీల కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనకాపల్లి, మునగపాక మండలాలు నాటికలకు పుట్టినిల్లని, నేటి యువతకు నాటికలపై అవగాహన కల్పించాలని ఆయన కోరారు. క్లబ్ ఆవరణలో కొణతాల వెంకట నారాయణమ్మ కళా ప్రాంగణంలో ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నాటికలు ఉచితంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ నెల 2న సాయంత్రం 6.30 గంటలకు శ్రీకాకుళం జిల్లా బోరివంక శార్వాణి గిరిజన సాంస్కృతిక సేవా సమితి వారి ‘నిర్జీవ నినాదం’ నాటిక (రచన అడపా సూరిబాబు), రాత్రి 8 గంటలకు విశాఖపట్నం తెలుగు కళా సమితి వారితో ‘నిశ్శబ్దమా నీ ఖరీదెంత’ నాటిక (రచన పి.టి.మాధవ్), 3న సాయంత్రం 6.30 గంటలకు హైదరాబాద్ కళాంజలి వారి ‘రైతే రాజు’ నాటిక (రచన కంచర్ల



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న క్లబ్ సభ్యులు

సూర్యప్రకాశరావు), రాత్రి 8 గంటలకు గుంటూరు అభినయ ఆర్ట్స్ వారి ‘అతీతం’ నాటిక (దర్శకత్వం ఎస్.రవీంద్రరెడ్డి), 4న సాయంత్రం 6.30 గంటలకు గుంటూరు అమృత లహరి థియేటర్ ఆర్ట్స్ వారి ‘నాన్నా నేనొచ్చేస్తా’ నాటిక (నాటకీకరణ తాళాబత్తుల వెంకటేశ్వరరావు), రాత్రి 8 గంటలకు చిలకలూరిపేట వారి ‘అలితో సరదాగా’ హాస్య నాటిక (రచన అద్దేపల్లి భరత్‌కుమార్) ప్రదర్శించనున్నట్టు తెలిపారు. నాటిక పోటీలను ఉచితంగా తిలకించవచ్చన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మళ్ల చంద్రశేఖర్, కోశాధికారి ఆళ్ల వెంకట సూర్యేశ్వరరావు, ఉపాధ్యక్షుడు చవితిని నర్సింగరావు, నాటికల కన్వీనర్‌గా మాజీ కౌన్సిలర్ కె.ఎం.నాయుడు, క్లబ్ మేనేజర్ ఆర్.సీతారాం పాల్గొన్నారు.

పురుగు మందు తాగి యువకుడి మృతి



వంశీకృష్ణ (ఫైల్)

రాంబిల్లి : గోవిందపాలేనికి చెందిన ధారబోయిన వంశీకృష్ణ(20) గురువారం పురుగు మందు సేవించి మృతి చెందినట్టు ఎస్ఐ దీనబంధు తెలిపారు. వంశీకృష్ణ పురుగు మందు సేవించి వుండగా గమనించిన కుటుంబసభ్యులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు నిర్ధారించారు. ఈ మేరకు వంశీ కృష్ణ తండ్రి నర్సింహమూర్తి తమకు ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. గతంలో మైనర్ బాలికను వేధించిన కేసులో వంశీ రెండు నెలలు జైలు శిక్ష అనుభవించి, బెయిల్‌పై బయటకు వచ్చాడు. కేసు కోర్టులో ఉండడంతో తనకు శిక్ష పడుతుందని మళ్లీ జైలుకు వెళ్లాల్సి వస్తుందని భావించి మనస్తాపానికి గురై పురుగుమందు తాగాడని ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చందనోత్సవ నిర్వహణ వైఫల్యాలపై విచారణ

సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవం నిర్వహణలో చోటు చేసుకున్న వైఫల్యాలపై రాష్ట్ర దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్ చంద్రకుమార్ గురువారం విచారణ చేపట్టారు. ఏప్రిల్ 23న జరిగిన చందనోత్సవంలో రాజగోపురం ఎదురుగా గంటల తరబడి వీవీఐపీలు నిలబడటం, వారంతా తమకు దర్శనం కాలేదని నిరసన వ్యక్తం చేయడం, శారదాపీఠాధిపతి చందనోత్సవం నిర్వహణపై బహిరంగంగా విమర్శించడం, తర్వాత ఈ ఘటనపై కలెక్టర్ విచారణకు ఆదేశించడం, దేవస్థానం ఉద్యోగులను జేసీ తన కార్యాలయంలో విచారించడం తెలిసిందే. అలాగే దేవదాయశాఖ కూడా విచారణకు ఆదేశించి చంద్రకుమార్‌ను నెల రోజుల కిందటే నియమించింది. ఈ నేపథ్యంలో గురువారం ఆయన దేవస్థానానికి వచ్చి విచారణ చేపట్టారు. ఏయే ప్రాంతాల్లో లోటుపాట్లు జరిగాయో స్వయంగా పరిశీలించారు. కొన్ని రికార్డులను తనిఖీ చేశారు. దేవస్థానం ఈవోతో మాట్లాడారు. క్యూలు ఏ విధంగా ఏర్పాటు చేశారని ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ రోజు ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వర్తించిన దేవస్థానం ఉద్యోగులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ మినిట్స్‌ను పరిశీలించారు. టికెట్లు ఎన్ని ముద్రించారు.? ఎన్ని విక్రయించారు? తదితర వివరాలు సేకరించారు. శుక్రవారం కూడా విచారణ కొనసాగనుంది. విచారణలో దేవదాయశాఖ డీసీ విజయ్‌రాజ్ చంద్రకుమార్ ఉన్నారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



కప్ప స్తంభానికి మొక్కుకుంటున్న ఏడీసీ చంద్రకుమార్

వీర్ కశ్యప్‌కు నేవీ సత్కారం

దొండపర్తి(విశాఖ దక్షిణ): ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అందుకున్న విశాఖ నేవీ స్కూల్ విద్యార్థి, నేవీ కమాండర్ కశ్యప్ కుమారుడు మాస్టర్ వీర్ కశ్యప్‌ను భారత నావికాదళపతి అడ్మిరల్ ఆర్.హరికుమార్ గురువారం విశాఖపట్నంలో సత్కరించారు. 2020లో 7వ తరగతిలో ఉన్న వీర్ కశ్యప్ కోవిడ్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ‘కరోనా యుగ’ పేరుతో బోర్డ్ గేమ్‌ను రూపొందించాడు. ఈ గేమ్.. మాస్క్ ధరించడం, భౌతిక దూరం పాటించడం వంటి జాగ్రత్తలపై అవగాహన కల్పించడంతో పాటు వినోదాన్ని కూడా అందించింది. దీంతో వీర్ కశ్యప్‌కు ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలపురస్కార్–2021 ప్రదానం చేశారు. ఈ గేమ్ యువ ప్రతిభకు నిదర్శనమని హరికుమార్ ప్రశంసించారు.

గంజాయితో ముగ్గురు అరెస్టు

గొలుగొండ : కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా 8 కేజీల గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను కృష్ణదేవిపేట పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ ఉపేంద్ర అందించిన వివరాలివి. చింతపల్లి ప్రాంతం నుంచి అబ్దుల్ బాషిత్, అబూకర్, సిహెచ్.నవీన్‌కుమార్ అనే ముగ్గురు వ్యక్తులు బ్యాగ్‌లో 8 కేజీల గంజాయి తరలిస్తున్న సమయంలో కృష్ణదేవిపేట బస్‌స్టేషన్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, ముగ్గురినీ అరెస్టు చేసి కోర్టుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

‘బ్రాండిక్స్’ బస్సులు ఢీ

- పది మందికి పైగా గాయాలు

అచ్యుతాపురం (అనకాపల్లి): బ్రాండిక్స్ ఆవరణలో పనులు ముగించుకొని ఇళ్లకు వెళుతున్న కార్మికుల బస్సులు పరస్పరం ఢీకొనడంతో పది మందికి పైగా గాయపడ్డారు. గురువారం జరిగిన ఈ ఘటనతో కార్మికులు ఆందోళనకు గురయ్యారు. గాయపడిన సత్య, కుమారి, రామలక్ష్మి, ధన, నాగలక్ష్మి, దేవి తదితరులను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఒక బస్సు బ్రేక్ ఫెయిల్ అవ్వడం వల్లే ఈ ప్రమాదం సంభవించినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని, వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని సీఐటీయూ నాయకుడు ఆర్.రాము డిమాండ్ చేశారు.



చికిత్స పొందుతున్న బ్రాండిక్స్ కార్మికురాలు

సూట్‌కేసుల్లో గంజాయి తరలింపునకు యత్నం

కూర్మన్నపాలెం(గాజువాక): రెండు సూట్‌కేసుల్లో పెట్టి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని దువ్వాడ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఇమ్రాన్ అలీ(27), ఉత్తరప్రదేశ్‌కు చెందిన అబ్దుల్ జబ్బీర్(33) గత నెల 20న గంజాయి కోసం విశాఖపట్నానికి వచ్చారు. నగరానికి చెందిన ఓ వ్యక్తి వద్ద నుంచి 15 కేజీల గంజాయి కొనుగోలు చేశారు. ఇందుకు రూ.30 వేలు చెల్లించారు. ఎవరికీ అనుమానం రాకుండా రెండు సూట్‌కేసుల్లో గంజాయి అమర్చి తరలించేందుకు ప్రయత్నించారు. పక్కా సమాచారం మేరకు దువ్వాడ పోలీసులు కూర్మన్నపాలెం వద్ద తనిఖీ నిర్వహించారు. కూర్మన్నపాలెం బస్ డిపో వద్ద నిందితులు అనుమానాస్పదంగా తిరుగుతూ దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు ఆటోలను ఆపుతున్నారు. ఈ క్రమంలో పోలీసులను చూసి సూట్‌కేసులను అక్కడ వదిలి పారిపోయేందుకు ప్రయత్నించారు. దువ్వాడ పోలీసులు అప్రమత్తమై వెంబడించి మరీ నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 15 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్‌లు, రూ.1200 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

తుపాకీ తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

- పోలీసుల అదుపులో నిందితుడు




మాట్లాడుతున్న క్రైం డీసీపీ నాగన్న



కోర్టుకు తరలిస్తున్న శ్రీధర్ హరికిషన్ పతాంగి

సీతమ్మధార: మహారాష్ట్ర నుంచి ఒడిశాకు తుపాకీని తీసుకెళ్తున్న శ్రీధర్ హరికిషన్ పతాంగిని ఫోర్త్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రైం డీసీపీ నాగన్న ఈ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన శ్రీధర్ హరికిషన్.. సంపాదన తక్కువగా ఉండటంతో తన బావమరిదిని కలిసి ఏదైనా పని ఉంటే చెప్పమన్నాడు. ఆయన తన స్నేహితుడు జిల్నా జిల్లాకు చెందిన దత్త పవర్‌కు ఈ విషయం చెప్పాడు. వెంటనే ఆయన్ని శ్రీధర్ కలిశాడు. పూరిలోని ఓ వ్యక్తికి తుపాకీ ఇస్తే రూ.30 వేలు ఇస్తామని బేరం కుదుర్చుకున్నాడు. అడ్వాన్స్‌గా రూ.10 వేలు శ్రీధర్‌కు ఇచ్చాడు. తుపాకీ అందించిన తర్వాత రూ.20 వేలు ఇచ్చేందుకు ఒప్పందం జరిగింది. దీంతో శ్రీధర్ పూరి జగన్నాథస్వామిని దర్శించుకునేందుకు వెళ్దామని ఐదుగురి స్నేహితులను బయలుదేరించాడు. సోమవారం ఉదయం జల్నా రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరి.. మధ్యాహ్నం మూడు గంటలకు నాందేడ్‌కు చేరుకున్నారు. నాందేడ్ నుంచి విశాఖపట్నంకు నాగావళి ఎక్స్‌ప్రెస్‌లో మంగళవారం ఉదయం వచ్చారు. సాధారణ బోగీలో రావడంతో ఒకరోజు విశాఖలో విశ్రాంతి తీసుకుని బుధవారం పూరి వెళ్లేందుకు ప్లాన్ చేసుకున్నారు. రైల్వే న్యూకాలనీలోని ఓ లాడ్జీలో 101, 105 నంబర్లు ఉన్న గదులను బుక్ చేసుకున్నారు. కాగా.. సీపీ ఆదేశాల మేరకు రోజు వారి విధుల్లో భాగంగా ఎస్ఐలు ఖగేశ్వరరావు, వెంకటరావు మంగళవారం ఈ లాడ్జీని తనిఖీ చేశారు. ఈ క్రమంలో 105 నంబర్ గదిని పరిశీలిస్తుండగా.. ముగ్గురు అనుమానితులుగా కనిపించారు. ఎక్కడకు వెళ్తున్నారని పోలీసులు అడగడంతో తడబడ్డారు. బ్యాగులు తనిఖీ చేయడంతో తుపాకీ బయటపడింది. మొత్తం ఆరుగురిని ఫోర్త్‌టౌన్ స్టేషన్‌కు తరలించి విచారించడంతో అసలు విషయం బయటపడింది. తన స్నేహితుడు ఒడిశాలోని ఓ వ్యక్తికి తుపాకీ ఇవ్వాలని చెప్పడంతో బయలుదేరినట్లు శ్రీధర్ పోలీసుల వద్ద ఒప్పుకున్నాడు. మహారాష్ట్రలో శ్రీధర్‌కు తుపాకీ ఇచ్చిన దత్తపవర్ చిరునామా కనుగొన్న ఎస్ఐ వెంకటరావు బృందం.. అక్కడకు వెళ్లి మరింత సమాచారం సేకరించింది.



తుపాకీ

తుపాకీ అమ్మిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని నగరానికి తీసుకొస్తున్నారు. అయితే తుపాకీపై నంబర్ లేకపోవడం గమనార్హం. శ్రీధర్‌పై కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. మిగిలిన ఐదుగురిని శుక్రవారం విడిచిపెట్టే అవకాశం ఉంది. సమావేశంలో తూర్పు ఏసీపీ మూర్తి, సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ సెంటర్ వద్ద వాగ్వాదం

- ప్రైవేట్ కళాశాలల ఏజెంట్ల హల్‌చల్
- ప్రభుత్వ కళాశాల సిబ్బందితో దురుసు ప్రవర్తన

నర్సీపట్నం : ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వద్ద ప్రైవేట్ కళాశాలల ఏజెంట్లు తిష్టవేసి ఉండడంతో కళాశాల సిబ్బంది నిలదీశారు. దీంతో కౌన్సెలింగ్ సెంటర్ వద్ద వాగ్వాదం చోటు చేసుకుంది. వారి వారి కళాశాలలో అడ్మిషన్లు పెంచుకునేందుకు ప్రైవేట్ కళాశాలల ప్రతినిధులు నియమించుకున్న ఏజెంట్లు కళాశాల వద్ద తిష్ట వేసి విద్యార్థులను మోటివేషన్ చేస్తున్నారు. మూడు రోజుల నుంచి కౌన్సెలింగ్‌కు వచ్చిన విద్యార్థుల నుంచి ఫోన్ నెంబర్లు, జెరాక్స్ సర్టిఫికెట్లు సేకరిస్తున్నారు. దీనిని కళాశాల సిబ్బంది గమనించి బయట వ్యక్తులు కళాశాల ఆవరణ నుంచి వెళ్లిపోవాలని సూచించారు. అయితే తాము విలేకరులమని టీవీ 49 పేరుతో ఐడీ కార్డు చూపిస్తూ కళాశాల సిబ్బందితో దురుసుగా ప్రవర్తించారు. విద్యార్థుల గార్డియన్‌గా చెప్పుకుంటూ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వద్ద హల్‌చల్ చేశారు. దీంతో విలేకరుల ముసుగులో వచ్చిన ప్రైవేట్ కళాశాలల ఏజెంట్ల చేతుల్లో ఉన్న విద్యార్థుల వివరాలతో కూడిన డైరీలను కళాశాల సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థుల వివరాలతో మీకేంటి పని? అంటూ గట్టిగా వారిని నిలదీశారు. దీంతో ఆ ఏజెంట్లు అక్కడ నుంచి జారుకున్నారు.

ప్రసాద్ స్కీమ్ పనుల బుక్‌లెట్ రూపకల్పన

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ స్కీమ్ ద్వారా చేసే అభివృద్ధి పనుల జాబితాని దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు బుక్‌లెట్ రూపంలో పొందుపరిచారు. ఆ బుక్‌లెట్‌ని విశాఖ శ్రీ శారదాపీఠంలో పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి గురువారం ఆవిష్కరించారు. రూ.54.04 కోట్లతో దేవస్థానంలో జరగనున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించి గత నెల 26 నుంచి ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ టెండర్ల ప్రక్రియకి శ్రీకారం చుట్టింది. ఆ పనులకి సంబంధించి పూర్తి అంశాలతో ట్రస్ట్‌బోర్డు సభ్యులు బుక్‌లెట్‌ని తయారు చేశారు. దాన్ని స్వామీజీ ఆవిష్కరించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, దొడ్డి రమణ, వారణాసి దినేష్‌రాజ్, సువ్వాడ శ్రీదేవి, పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు పాల్గొన్నారు.



బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి

అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు భేష్

డాబాగార్డెన్స్: సుప్రీంకోర్టు తీర్పుతో అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడం ప్రశంసనీయమని సోషల్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గురునాథం అన్నారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 977 రోజులుగా అమరావతిలో వికేంద్రీకరణ, 55 వేల ఇళ్ల పట్టాల సాధన, ఇంగ్లిష్ మీడియం, తదితర అంశాలపై 27 వేల గంటలు దీక్ష చేశామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 6 జోన్లతో సీఆర్‌డీఏ చట్టం చేశారని గుర్తు చేశారు. అక్కడ ఐదు శాతం చొప్పున ఎస్సీ, ఎస్టీ, బీసీలకు స్థలాలు కేటాయించాల్సి ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్ సర్కారు పేదలకు ఇళ్ల స్థలాల మంజూరుకు ముందుకు వస్తే ప్రతిపక్ష నేత చంద్రబాబు కోర్టు స్టే తేవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో మూడు రాజధానుల ఏర్పాటుకు మద్దతిస్తున్నామని చెప్పారు. అమరావతిలో పార్టీలకతీతంగా ఉద్యమం చేస్తున్నామని, ఇళ్ల స్థలాల కోసం సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడం హర్షణీయమన్నారు. విశాఖలో సెప్టెంబర్ నుంచి పాలన ప్రారంభం కానుండడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. పేదలకు కేటాయిస్తున్న ఇళ్ల స్థలాలను చంద్రబాబు శ్మశానంతో పోల్చడం దారుణమన్నారు. ఈ సమావేశంలో బహుజన పరిరక్షణ సమితి యువజన నాయకుడు లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సోషల్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గురునాథం

నేవీ, ఎస్ఎస్‌సీ ఉద్యోగాలకు శిక్షణ

డాబాగార్డెన్స్: అల్లూరి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఇండియన్ నేవీ చార్జ్‌మెన్, ఎస్ఎస్‌సీ గ్రూప్–సి ఉద్యోగాలకు కోచింగ్ ప్రారంభించనున్నట్టు స్టడీ సర్కిల్ నిర్వాహకుడు కె.అభిమన్యు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 5 నుంచి డాబాగార్డెన్స్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం వేదికగా తరగతులు ప్రారంభంకానున్నాయని తెలిపారు. అర్థమెటిక్, రీజనింగ్, ఇంగ్లిష్, జీకేతో పాటు 24 ట్రేడ్‌లకు సంబంధించి అనుభవజ్ఞులైన నిపుణులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు http://bit.ly/3G1NgEW లింక్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8008412798 నంబరులో సంప్రదించవచ్చు.